క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రి పరామర్శ



శ్రీనును పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 4వ వార్డు కౌన్సిలర్ నిమ్మకాయల సువర్ణమ్మ కుమారుడు శ్రీనును ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర శుక్రవారం పరామర్శించారు. శ్రీను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

200 మందికి వైద్య పరీక్షలు

బలిజిపేట: వంతరాంలో సర్పంచ్ బెవర బాల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో శిబిరం నిర్వహించారు. 32 మంది శస్త్రచికిత్సలకు ఎంపికైనట్టు వైద్యులు సీతారాం, రాజేష్ తెలిపారు. వీరిని నెల్లిమర్ల మిమ్స్‌కు తరలించనున్నట్టు తెలిపారు. వైద్య సిబ్బంది తమ సేవలు అందించారు.

సువర్ణముఖిలో భక్తుల చక్రస్నానాలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది సమీపంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రితో ముగియడంతో భక్తులు ఉత్తరాయణ దిశలో నీరు ప్రవహిస్తున్న రేవులో శుక్రవారం ఉదయం చక్రస్నానాలు ఆచరించారు. మంగళవారం నుంచి గురువారం రాత్రి వకు లక్ష్మీనృసింహస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం నేపత్యంలో రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి, లక్ష్మీనృసింహస్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.

ఏరియా ఆస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న అవనాపు దంపతులు

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నవజీవన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పౌష్టికాహారం పంపిణీని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డా.అవనాపు భావన దంపతులు శుక్రవారం ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న నవజీవన్ సేవా సంస్థను వారు అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రత్నకుమారి, ట్రస్టు ఫౌండర్ ఆచార్య, బ్రాంచి మేనేజర్ చిన్నమ్ములు, ఎస్‌ఐ పాపారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని శివీల్లి గ్రామం సమీపంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు కోటి రూపాయిలతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం బ్రిడ్జి గ్రౌండ్ లెవెల్‌లో జరుపుతున్న ఐరన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు జరిపించాలన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా జరిపించాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు.

శత్రుచర్ల పరామర్శ



కిశోర్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

పార్వతీపురం టౌన్: ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు కిశోర్‌కుమార్ తండ్రి గంట రామారావు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజా క్షేత్రంలోకి జగనన్న సైన్యం

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు
- ప్రజాభిప్రాయ సేకరణలో గృహసారథులు, వలంటీర్లు
- జగనన్నకే మద్దతుగా ఉంటామని చెప్పిన ప్రజలు

పార్వతీపురం టౌన్:

ప్రజా క్షేత్రంలోకి జగనన్న సైన్యం దిగింది. ప్రభుత్వం ప్రజలకు అందించిన ప్రజా సంక్షేమ పాలనను ప్రజలకు వివరించేందుకు నడుం బిగించింది. ఇంటింటికి వెళ్లి జగనన్నకు మద్దతు తెలిపేలా కార్యాచరణ చేపట్టారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంఆ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పురపాలక సంఘం ఆరో వార్డు పరిధి నవిరి కాలనీలో ఈ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముందు విలేకరుల సమావేశంలో జగనన్నే మా భవిష్యత్తు ఉద్దేశం, విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ అన్నది ప్రజల నినాదంగా మారు మోగుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల మంది జగనన్న సైనికులు 14 రోజుల్లో 75 వేల కుటుంబాలను నేరుగా కలుస్తారని చెప్పారు. కార్యక్రమం ఈ నెల 20 వరకు కొనసాగుతోందన్నారు. గృహసారథులు ఇంటింటికి వెళ్తారని వారిని సచివాలయ కన్వీనర్లు కోఆర్డినేట్ చేస్తారన్నారు.

విష ప్రచారాలకు చెక్...

మేమేదో ఇతర పార్టీలు మాదిరిగా టెలిఫోన్ సర్వేలతో మాకు మేం చంకలు గుద్దుకునే కార్యక్రమంగా 'జగనన్నే మా భవిష్యత్తు'ను జరపదలచుకోలేదన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నేరుగా ప్రజలను కలిసి.. గతానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడాను చెబుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ఎందుకు కోరుకోవాలో.. భావితరాల భవిష్యత్తుకు వైఎస్ఆర్‌సీపీకి అధికారం ఆవశ్యకతను వివరిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా విష ప్రచారాలకు దీంతో చెక్ పెడతామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం పురపాలక సంఘం, రూరల్ ప్రజా ప్రతినిధులు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, పార్వతీపురం మండలం జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, జేసీఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు వలంటీర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం టౌన్: ఇంటింటికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే



పార్వతీపురం టౌన్: ప్రజాభిప్రాయ సేకరణలో గృహసారధి



బలిజిపేట: చిలకలపల్లిలో ఇంటింటా తిరుగుతున్న జడ్పీటీసీ రవికుమార్

పీపుల్స్ సర్వేలో భాగస్వాములు కావాలి

సీతానగరం: 'జగనన్నే మా భవిష్యత్తు' అనే పీపుల్స్ సర్వేలో కార్యకర్తలు, అభిమానులు, భాగస్వాములు కావాలని ఎంపీపీ బి.రవణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ వేర్వేరు గ్రామాల్లో కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లుతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్తు' పీపుల్స్ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించారు. సూరంపేట సచివాలయం పరిధిలో మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటి పీపుల్స్ సర్వే చేశారు.

మేలు మరిచిపోకండి

బలిజిపేట: మండలంలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. పెదపెంకిలో ఎంపీపీ నాగమణి, చిలకలపల్లిలో జెడ్పీటీసీ రవికుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి ఇంటింటా తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మేలు మరిచిపోవద్దని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములనాయుడు, పెరిక బలిజ డైరెక్టర్ శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: మొబైల్ స్టిక్కర్‌ను చూపుతున్న గృహిణి



సీతానగరం: పెదంకలాంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రవణమ్మ



సీతానగరం: లచ్చయ్యపేటలో సర్వే కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాబ్జీ

సీతానగరంలో...

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని ప్రజల ఆశీస్సులు పొందారు. ఈ మేరకు ఆయన పర్యటించిన పాపమ్మవలస, ఇప్పలవలస గ్రామాల్లో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలను ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బి. చిట్టిరాజు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ క్షేత్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో ఇంటింటా తిరుగుతున్న ఎంపీపీ నాగమణి

సస్యరక్షణ చర్యలపై అవగాహన

పార్వతీపురం టౌన్: రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి వుండాలని సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు జిల్లాలోని పార్వతీపురం తదితర ప్రాంతాల్లో రైతులకు క్షేత్ర స్థాయిలో పంటల సాగు విధానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా సుడిదోమ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

వారం రోజుల పాటు రైతుల పొలాల్లో పర్యటించి శత్రు, మిత్ర కీటకాలపై అవగాహన కల్పించనున్నారు. పంటలకు ఆశించి ఆకులను తిని దిగుబడి తగ్గించే సుడిదోమపై రైతులకు మరింత అవగాహన కల్పించారు. దీని నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పంటలను నాశనం చేసే పురుగులలో ఇది చాలా ప్రమాదకరమైనదని తెలిపారు. రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ (రావెప్) కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం గైడ్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులు కె.అభినవ్, లక్ష్మణ్, మోనిస్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు

రైతులకు ఉచితంగా నవధాన్యాల కిట్లు

కొత్తవలస: చీడివలస క్లస్టర్ పరిధిలోని 13 గ్రామైక్య సంఘాల్లో 2,198 మంది రైతులకు ఉచితంగా నవధాన్యాల కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు సబల సంస్థ కోఆర్డినేటర్ గోవిందరావు తెలిపారు. తుమ్మికాపల్లి గ్రామంలో శుక్రవారం విత్తన ప్యాకెట్లను సిద్ధం చేశారు. మండలంలో ప్రస్తుత ఏడాదికి 2291 ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. స్థానిక రైతుల నుంచి వివిధ రకాల విత్తనాలను సేకరించినట్లు చెప్పారు. ఎకరాకు 10 నుంచి 13 కేజీలు చొప్పున 30 రకాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. త్వరలోనే రైతులకు విత్తన కిట్లు ఉచితంగా అందజేస్తామన్నారు.



విత్తనాలను ప్యాంకింగ్ చేస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం 5వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్చరణ మధ్య అర్చకులు వందలాది మంది దంపతులతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఆలయ ఆవరణంలో భారీ అన్నసమారాధన చేశారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

బొండపల్లి: ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చని యోగా శిక్షకులు మురళి అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో శుక్రవారం యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మురళి

సేంద్రియ ఎరువులతో ప్రయోజనం



సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: సేంద్రియ ఎరువులతోనే పంటలకు ఎంతో మేలు జరుగుతుందని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండల పరిధిలోని పొగిరి గ్రామంలో సేంద్రియ ఎరువులు ప్రదర్శిస్తూ వాటివలన కలిగే ప్రయోజనాలను శుక్రవారం రైతులకు వివరించారు. వర్మీకంపోస్టు, జీవామృతం, పంచగవ్య, తదితర సేంద్రియ ఎరువులు సొంతంగా తయారుచేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్‌ఎస్‌జే ప్రసన్న, కె.సాహితీ, కె.స్నేహిత, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: మండలంలోని కామునివలస, ఎస్.పెద్దవలస, శంబర గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు శుక్రవారం తెలిపారు. మావుడి 33కేవీ లైన్ పటిష్టం చేసేందుకు, కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నందున ఆయా గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పైపులైన్ మరమ్మతులు

వేపాడ: దబ్బిరాజుపేట గ్రామంలో తాగునీటి పైపులైన్ మరమ్మతులను శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ దండు ముత్యాలమ్మ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. గ్రామదేవత పండుగ, వేసవి నేపథ్యంలో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పైపులైన్లు బాగుచేయించినట్లు చెప్పారు.

సర్వేకు సహకరించాలి

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూరక్ష - భూహక్కు పథకం ద్వారా చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఇందుకు రైతులు కూడా సహకరించాలని కోరారు. మండలంలోని కృష్ణారాయపురంలో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేపై రామమందిరం వద్ద రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా రీసర్వే చేయకపోవడంతో రైతులకు చెందిన భూముల వివరాలు తెలియక అవస్థలు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. సర్వే పూర్తయితే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. సదస్సులో రీ సర్వే డీటీ పి.చిట్టమ్మ, సర్పంచ్ జి.అన్నంనాయుడు, సచివాలయ కన్వీనరు రెడ్డి అప్పలనాయుడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు పి.బలరాంనాయుడు, మాజీ సర్పంచ్ జి.స్వామినాయుడు, వీఆర్వో బాబూరావు, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రౌండ్ ట్రూతింగ్ మ్యాప్‌ను రైతులకు చూపిస్తున్న తహసీల్దార్ రమణ

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తవలస: గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకుని మండలంలోని క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును శిలువ వేసిన ఉదంతాన్ని గుర్తుచేసుకున్నారు. ఈస్టర్ ఆదివారం ముందు వచ్చే శుక్రవారం గుడ్‌ఫ్రైడేగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ మూడు రోజుల పాటు క్రీస్తు విశ్వాసకులు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేస్తారు.



కొత్తవలస జంక్షన్ వద్ద శిలువయాత్ర

సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభం రేపు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తోండ్రంగి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఈ నెల 9న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



బలిజిపేట నుండి వెంగాపురం చర్చి వరకు ఏసు శిలువను మోసుకువస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



సాలూరు: ధూళిభద్రలో నిర్వహిస్తున్న గుడ్‌ఫ్రైడే ఆరాధన



పార్వతీపురం టౌన్: గుడ్‌ఫ్రైడ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసును కీర్తిస్తూ పాటలు పాడారు. ఆయా కార్యక్రమాల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: క్రీస్తు వేషధారణలో భక్తులు